క్లుప్తంగా

జేసీ ఔదార్యం



మచిలీపట్నంటౌన్: జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ ఔదార్యాన్ని చాటారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ప్రచారంలో భాగంగా కోనేరు సెంటర్‌లో మారథాన్ ర్యాలీ ప్రారంభించేందుకు శనివారం ఆమె హాజరయ్యారు. ర్యాలీలో పాల్గొనేందుకు 46వ డివిజన్‌కు చెందిన బాలుడు దేవరుషి నందన్ కాళ్లకు చెప్పులు లేకుండా వచ్చాడు. దీనిని గమనించిన జేసీ ఆ బాలుడిని సమీపంలోని ఓ దుకాణానికి తీసుకునివెళ్లి బూట్లు కొని ఇచ్చారు. దగ్గరుండి బాలుడికి సరిపడా బూట్లు తొడిగించారు. అనంతరం ఆ బాలుడు మారథాన్‌లో జేసీతో కలిసి పాల్గొన్నాడు.

జల్‌జీవన్ మిషన్‌పై సమావేశం

నాగాయలంక: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జూమ్ ద్వారా వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు శనివారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కె.కిశోర్, డాక్టర్ వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం కె.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



కృత్తివెన్ను: పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి పరీక్షా మెటీరియల్‌ను శనివారం సంగమూడి ఉన్నత పాఠశాలలో అందజేశామని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక వీటిని ఉచితంగా అందజేశారన్నారు. పరీక్షా మెటీరియల్‌ను ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

చీరలు, వస్త్రాలు పంపిణీ



కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం గూడెంలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా చైర్మన్ శ్యాంసన్ ఆర్థిక సహకారంతో 100 మంది వితంతువులకు చీరలు, 50 మంది పురుషులకు వస్త్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బోడాబత్తిన పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ పాలిమెట్ల వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ కేవీవీ సత్యనారాయణ, కొక్కిలిగడ్డ మాధవరావు, బుర్రె మరియదాసు, పాలిమెట్ల చంటి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్

పెడన: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. స్థానిక విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ గౌరీప్రసాద్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏసుప్రభువును ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ జాలి, దయ, కరుణ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, కౌన్సిలర్ బాబూలాల్, నాగకుమార్, సిస్టర్ హెలేన్, పాస్టర్ జయరాజు పాల్గొన్నారు.

చల్లపల్లి: స్థానిక మదర్ థెరిస్సా హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్–రోజా దంపతులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రీస్తు సందేశం అందించారు. సురేష్ దంపతులను సత్కరించారు. వివేకానందా డిగ్రీ కళాశాలలో సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

గోమాతకు సీమంతం

కోడూరు: మండల పరిధిలోని హరిపురంలో మహంకాళీ అమ్మవారి ఆలయానికి సంబంధించిన గోవుకు శనివారం సీమంతం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు గోవుపై వస్త్రాలు, పూలు, గాజులు ఉంచి సీమంతం చేశారు. గోవు నుదుట పసుపు, కుంకుమ బొట్లు పెట్టి పండ్లు, చలిమిడి తినిపించారు.

మాజీ ప్రధాని పీవీకి నివాళి

మచిలీపట్నంటౌన్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని శనివారం నగరంలో నిర్వహించారు. ప్రధాన రహదారిలోని ప్రధాన పార్కు వద్ద ఉన్న పీవీ నరసింహారావు విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగువాడైన పీవీ నరసింహారావు ప్రధాని స్థాయికి ఎదిగి దేశాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన సేవలు మరువరానివన్నారు. బహుభాషా కోవిదుడిగా, రచయితగా, మంచి రాజకీయ నేతగా ఆయన పనిచేశారని చెప్పారు.



బచ్చుపేట ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పేర్ని నాని దంపతులు



శ్రీకాకుళంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి దంపతులు



పెడనలో వేణుగోపాల స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



శ్రీకాకుళంలో ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

ముక్తిదాయకం.. ముక్కోటి ఏకాదశి

- స్వామివారి ఉత్తర ద్వార దర్శనం
- భక్తిశ్రద్ధలతో పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని పలు దేవాలయాల్లో శనివారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, అనంతరం ఊంజల సేవ జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెడన: పట్టణంలోని పలు వైష్ణవ ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్సవమూర్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి అగ్నిహోత్రం హరికృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. స్వామి వారిని వేకువజాము నుంచే భక్తులు దర్శించుకుని పూజలు చేయించారు. సాయంత్రం స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ వారు పర్యవేక్షించారు. శ్రీకోదండ రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగాయలంక: నాగాయలంక గ్రామంలోని ప్రాచీన వేణు గోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాలుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. సుబ్రహ్మణ్యం, సుధ దంపతుల పర్యవేక్షణలో దీవి ఫణి కృష్ణమాచార్యులు, శిష్యా షణ్ముఖ చంద్రశేఖరస్ బ్రహ్మత్వంలో స్వామికి ఏకాదశ పూజలు జరిపారు. మహిళా భక్త బృందం సభ్యులు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. సబ్బినేని బజారు, తూర్పు బజారులోని కోదండ రామాలయాల్లో భక్తులకు వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అర్చకులు దీవి మురళి ఆచార్యులు, ఘంటసాల పవన్‌శర్మ ఆధ్వర్యంలో ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వార పూజలు జరిగాయి. సబ్బినేని బాబూ భవానీ వరప్రసాద్, సుజాత తదితరులు పాల్గొన్నారు. కృష్ణానది తీరంలో శ్రీరామ పాద క్షేత్రం ప్రాంగణంలోని సీతారామచంద్రుల ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ఉత్తర ద్వార దర్శనం చేయించారు. కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ముదునూరి శ్రీనివాసశాస్త్రి పూజలు నిర్వహించారు.



బంటుమిల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు



పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారు



పూజలందుకున్న పెదకళ్లేపల్లిలోని మదన గోపాలస్వామి

స్వామివారికి ఎమ్మెల్యే సింహాద్రి దంపతుల పూజలు

అవనిగడ్డ: ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. చారిత్రక ప్రసిద్ధి నొందిన ఘంటసాల మండలంలోని శ్రీకాకుళంలో శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు – కెప్టెన్ లక్ష్మీ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్తర ద్వార దర్శనం చేసిన స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఎస్‌ఐ కె. శ్రీనివాస్ దంపతులు, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఏసీ చక్రధరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అవనిగడ్డలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం, పులిగడ్డ, వేకనూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారు ఉత్తర ద్వార దర్శనం చేశారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



నాగాయలంక ప్రాచీన వేణు గోపాలస్వామి ఆలయంలో పూజలు

బంటుమిల్లి: బంటుమిల్లి పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి, సీతారామాంజనేయస్వామి, పాశ్చాపురం సువర్చలాంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారు ఝామున స్వామివార్ల ప్రధానమూర్తులను ఉత్తరాభిముఖంగా ఉంచి విశేష అలంకారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తుల గోవింద నామాలతో మార్మోగాయి. శనివారం కలిసి రావడంతో పలు గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి విశేష పూజలు చేశారు. చోరంపూడి, అర్తమూరు, ముంజులూరు, మల్లేశ్వరం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో ప్రధాన మూర్తులను, ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి పూజలు చేశారు. బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఈ. సుధాకరరావు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామి వారికి పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి వేద మంత్రాలతో సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉత్తరద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. కృత్తివెన్ను మండలం లక్ష్మీపురం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కృత్తివెన్ను శివాలయం వద్ద, రమా సహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయం వద్ద పల్లకిసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. కోలాట భజనలు ఆకట్టుకున్నాయి. స్వామివారి నగరోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) దంపతులు పాల్గొన్నారు. ఆలయ మర్యాదలతో పేర్ని నాని కుటుంబ సభ్యులకు పూజారులు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల్లో 13వ డివిజన్ కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గాజుల భగవాన్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్ పాల్గొన్నారు. నగరంలోని రుస్తుంబాద భద్రాద్రి రామాలయంలో స్వామివారిని పేర్ని కిట్టు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అనుమకొండ శ్రీధర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. నగరంలోని చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, బలరామునిపేటలోని యతిరాజ భవనం, నిజాంపేటలోని బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయం తదితర ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు.



రంగనాయకస్వామి ఆలయంలో స్వామివారి ప్రదక్షిణలు



చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి నగరోత్సవం

గూడూరు: గూడూరులోని సీతారామస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలో ముక్కోటి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చల్లపల్లి: స్థానిక శ్రీ గరుడ ఆంజనేయ సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం నిర్వహించారు. కమిటీ పెద్దలు పర్యవేక్షించారు. స్థానిక గీతామందిరంలో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు.

ఆడుదాం ఆంధ్రాను జయప్రదం చేద్దాం

పెడన: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని, రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులంతా ఉత్సాహంతో ఉన్నారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుతరావు అన్నారు. శనివారం పెనుమల్లి గ్రామంలో సర్పంచ్ గరికపాటి వెంకట రామానాయుడు అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రా ర్యాలీ నిర్వహించారు. అచ్యుతరావు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో సచివాలయం స్థాయి క్రీడా పోటీలుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంఈఓ–2 వైవీ హరనాథ్, సచివాలయ ఉద్యోగులు, పెనుమల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు అన్నారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల విద్యార్థులతో శనివారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26న స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో ఆడుదాం.. ఆంధ్రా పోటీలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని చెప్పారు. ఐదు రకాల క్రీడలను మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో బాల, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించిన అనంతరం గెలిచిన టీములతో మండల స్థాయిలో పోటీలు ఉంటాయని వివరించారు. గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా ర్యాలీ నిర్వహిస్తున్న అచ్యుతరావు, రామానాయుడు తదితరులు



కృత్తివెన్నులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

కృత్తివెన్ను: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ పిచ్చిబాబు, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంఈఓ ప్రసాద్‌లతో పాటు ఇతర అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నుండి సచివాలయాల స్థాయిలో జరిగే ఆటల పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు.

నాగాయలంక: గ్రామాల్లోని యువత ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ శనివారం తెలిపారు. జనవరి 9వతేదీ వరకు వివిధ స్థాయిల్లో క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ ఆటల పోటీలు జరుగుతాయని, క్రీడలు ప్రణాళికా బద్ధంగా నిర్వహించేందుకు అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఆయా పాఠశాలలను కేటాయిస్తూ ఇన్‌చార్జీలుగా నియమించామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడా పోటీలు విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని కోరారు.

చల్లపల్లి: గ్రామ స్థాయి క్రీడాకారులు ఎదిగేందుకు ఉత్తమ వేదిక ఆడుదాం ఆంధ్రా అని ఎంపీడీఓ చేకుచిన రాట్నాలు అన్నారు. శనివారం మండల పరిషత్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో ఆడుదాం ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టండి

- ఆస్తి, నీటి పన్నుల వసూలుకు ప్రత్యేక బృందాలు
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: ఆస్తి, నీటి పన్నుల బకాయిలు పేరకుపోతున్నాయని, మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి వసూలు చేయడానికి మనమంతా కృషి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. నాగకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలోని 24 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చర్చిలు, ప్రార్థనా మందిరాలు వద్ద ప్రత్యేకంగా శానిటేషన్ పనులు చేయాలని, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. మున్సిపల్ ఆదాయం అంతంత మాత్రంగానే ఉన్న నేపథ్యంలో మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగకుమారి

ఈ బృందాలు తమ ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు వారికి పూర్తి సహాయ సహకారాలను అందించాలని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, పిచ్చిక సతీష్‌బాబు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కమిషనర్ మహేంద్ర, టీపీఓ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో సమాజంలో గౌరవం

మానసిక వికాస నిపుణుడు చక్రవర్తి



కోనేరుసెంటర్: సత్ప్రవర్తన కలిగిన వ్యక్తులు ప్రతి విషయంలోనూ సత్ఫలితాలను సాధిస్తారని మానసిక వికాస నిపుణుడు విడియాల చక్రవర్తి అన్నారు. మచిలీపట్నం సబ్‌జైలులో శనివారం పరివర్తన కేంద్రాన్ని ప్రారంభించారు. చక్రవర్తి మాట్లాడుతూ ఖైదీలలో మానసిక పరివర్తన అవసరమన్నారు. జైలర్ పిల్లా రమేష్ మాట్లాడుతూ నెలలో రెండు రోజుల పాటు ఖైదీలకు పరివర్తన కేంద్రంలో ప్రముఖ వ్యక్తులతో ఖైదీలు పరివర్తన చెందేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తామని చెప్పారు. బెరాకా మినిస్ట్రీస్ నిర్వాహకుడు కిరణ్ పాల్ విదేశాలలో జైళ్ల పనితీరు, అక్కడి నేరస్తుల ప్రవర్తన, మార్పులను వివరించారు. డాక్టర్ యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ అనుమకొండ అనంతకుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధి సీహెచ్ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గూడూరు: గూడూరు మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో పర్యటించిన రాజ్యలక్ష్మి కోకనారాయణపాలెం, కంకటావ, గురిజేపల్లి, ముక్కొల్లు, నాగవరం, కలపటం, పినగూడూరులంక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలపై ఆమె సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న వసతులను ఆమె నమోదు చేసుకున్నారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, స్థానిక వీఆర్వోలు కాకుశేశ్వరరావు, బషీర్, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ఆయా పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలు పాల్గొన్నారు.

గీతాసారంతో వ్యక్తిత్వ వికాసం

బంటుమిల్లి: భగవద్గీతలోని గీతాసారం అవగాహన చేసుకుంటే మంచి సమాజం ఏర్పడుతుందని భగవద్గీత సత్సంగం సభ్యులు అన్నారు. శనివారం గీతా జయంతి సందర్భంగా జానకీరామపురం గ్రామంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో గీతా సత్సంగం ఏర్పాటు చేశారు. గడ్డం మల్లికార్జునరావు తదితరులు భగవద్గీతపై అవగాహన కల్పించారు. స్థానిక గీతా మందిరంలో శ్రీ కృష్ణుని విగ్రహానికి విశేష పూజలు చేశారు. వెంకట నారాయణపురం, బొసనపాడు, మల్లేశ్వరం గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాల్లో గీతా జయంతి పూజలు జరిగాయి.

నాగాయలంక: వేణుగోపాలస్వామి దేవస్థానం, స్థానిక గీతాసమాజం ఆధ్వర్యంలో గీతా జయంతి నిర్వహించారు. అర్చకుడు దీవి ఫణి కృష్ణమాచార్యులు నేతృత్వంలో రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామికి విశేష పూజలు జరిపారు. భగవద్గీత గ్రంథానికి పూజలు, గీతాపారాయణం చేశారు. మండలంలోని మర్రిపాలెం శ్రీరాధా కృష్ణ దేవాలయంలో గీతాజయంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక విద్యా భారతి ఉన్నత పాఠశాల, నాగాయలంకలోని మారుతి విద్యా నికేతన్‌లో గీతా జయంతి జరిగింది. విద్యార్థులు గీతా పారాయణం చేశారు.

పంట నష్టం జాబితాల ప్రదర్శన

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న పంటల వివరాలను ఆర్‌బీకే సెంటర్లలోని నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్నామని ఉద్యానశాఖాధికారి ఎన్. రమేష్ తెలిపారు. మోపిదేవి మండలంలో ఎక్కువగా అరటి, పలురకాల కూరగాయలు, బొప్పాయి, పూలతోటలు తుపాన్‌కు దెబ్బతిన్నట్లు గుర్తించామని చెప్పారు. 156 ఎకారాల్లో 165 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించి, పంటనష్టం నివేదికను ఆయా ఆర్‌బీకేల్లో నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

పెడన: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను స్థానిక గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో భద్రంగా ఉంచారు. వీటిని మండలంలోని వివిధ దేవాలయాల నిర్వాహకులకు, కమిటీల వారికి అందజేశామని వీహెచ్‌పీ పెడన సభ్యులు పిచ్చుక శంకర్ తెలిపారు.

26న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): లోక కల్యాణార్థం పెదకళ్లేపల్లి కోదండ రామాలయం వద్ద మన గుడిలో భాగంగా ఈనెల 26వ తేదీన సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని నిర్వాహకులు గరికిపాటి వీరాంజనేయులు తెలిపారు. శనివారం సాయంత్రం కరపత్రాలు ఆవిష్కరించి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గంలోని పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం స్థానిక గాడెల్లి కల్యాణ మండపంలో జరిగింది. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మితో కలిసి పాస్టర్లకు నూతన వస్త్రాలను అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు సమాజాన్ని సన్మార్గంలో నడిపించేలా ఉంటాయన్నారు. మచిలీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్ నోబుల్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాస్టర్ మత్తె భాస్కరకుమార్, జిల్లా కార్యదర్శి పాస్టర్ అబ్బూరి యోహాన్ పాల్గొన్నారు.